సాక్షి
కర్నూలు
శనివారం, 30, నవంబర్, 2024



శాస్త్రోక్తంగా ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి అష్టోత్తరం, ఖడ్గ మాల పూజలు జరిపించారు.



మహానందిలో సందడి

మహానంది: కార్తీకమాసం సందర్భంగా మహానందిలో శుక్రవారం భక్తజన సందడి కొనసాగింది. కోనేరుల్లో పుణ్యస్నానాలు చేసి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,629.87
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:93.416
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:2,429
అవుట్ ఫ్లో	:6,507



ప్రజలకు అవసరమైన అన్ని రకాల పౌర సేవలను స్థానికంగా అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ఐదేళ్ల పాటు విజయవంతంగా ఈ వ్యవస్థను నడిపించి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసింది. అయితే, ఆరునెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకుంది. ఇప్పటికే వలంటీర్లను తొలగించి ఉద్యోగులపై పని ఒత్తిడి పెంచిన సర్కారు తాజాగా ఇదే వ్యవస్థలో భాగమైన రైతుభరోసా కేంద్రాల ఉనికి లేకుండా చేస్తోంది. ఉద్యోగులకు జాబ్‌చార్ట్‌కు విరుద్ధంగా ఇతర శాఖల పనులు, వివిధ సర్వేలు అప్పగిస్తూ మానసిక వేదనకు గురిచేస్తోంది. సకాలంలో చేయకపోతే షోకాజ్ నోటీసులు జారీచేస్తోంది. ఈ ఒత్తిడి భరించలేక కొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.



కొలిమిగుండ్లలోని సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

ఉద్యోగి ఉక్కిరిబిక్కిరి!

- సచివాలయ ఉద్యోగులపై పనిభారం
- సర్వేలు, లక్ష్యాల సాధింపు పేరుతో ఒత్తిళ్లు
- వ్యవసాయ సిబ్బందికి ఇతర శాఖల పనులు అప్పగింత
- జాబ్‌చార్ట్‌కు విరుద్ధంగా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్, బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్
- ప్రతి రోజూ మూడు సార్లు బయోమెట్రిక్ హాజరు నిబంధన
- పెరిగిన పని ఒత్తిడితో మానసిక ఆందోళనకు గురవుతున్న ఉద్యోగులు
- ఇటీవల ఆళ్లగడ్డ మండలంలో వీఏఏ బలవన్మరణం
- గ్రామస్థాయిలో రైతులకు రోజురోజుకు నన్నగిల్లుతున్న సేవలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సచివాలయాలు	పనిచేస్తున్న మొత్తం ఉద్యోగులు	రైతుభరోసా కేంద్రాలు	ప్రస్తుతమున్న వీఏఏలు	వీఏఏల ఖాళీలు
1,188	10 వేలకు పైగా	867	531	336

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1188 గ్రామ/వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 10 వేలకు పైగా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వారిపై పనిభారం పెరిగింది. వలంటీర్లు లేకపోవడంతో పింఛన్ల పంపిణీతో పాటు రకరకాల సర్వేలు వారితోనే చేయిస్తోంది. ఒకేసారి రెండు, మూడు సర్వేలను కూడా చేయిస్తుండడంతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. దీనికి తోడు సర్వీస్ చాట్ ప్రిపేర్ చేయకపోవడం, పదోన్నతులు కల్పించకపోవడంతో మానసికంగా కుంగిపోతున్నారు. ఈ ప్రభావం రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) సిబ్బందిపై అధికంగా ఉంది. ఆ కేంద్రాల ఇన్‌చార్జీలైన వీఏఏ, వీహెచ్‌ఏ, వీఎస్‌ఏలతో పాటు గ్రామస్థాయిలో పశుసంపదకు సేవలు అందించే ఏహెచ్‌ఏలను ఇతర శాఖల పనులు అప్పగిస్తోంది. ఫలితంగా రైతులకు సకాలంలో సేవలు అందించలేని పరిస్థితి ఏర్పడింది.

అనుబంధ శాఖల పనులే ఎక్కువ

రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటైన తర్వాత రైతులకు గ్రామస్థాయిలోనే అన్ని రకాల సేవలు అందుతున్నాయి. దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిన ఈ కేంద్రాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. రైతుభరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలు (ఆర్‌ఎస్‌ఏ)గా మార్పు చేయడమే గాక సేవలను తగ్గిస్తూ వస్తోంది. వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించిన విధులు, బాధ్యతలతోనే రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు సతమతమవుతున్నారు. ప్రస్తుతం రబీ పంటలను ఈ–క్రాప్ నమోదు జరుగుతోంది. అలాగే ప్రతి మంగళ, బుధవారాల్లో విధిగా పొలం పిలుస్తోంది కార్యక్రమాలు చేపట్టాలి. పత్తి పంటను మద్దతు ధరతో అమ్ముకునేందుకు రైతులు ఆర్‌ఎస్‌ఏల్లోనే పేర్లు నమోదు చేయించాలి. ఇందుకు సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో ఉండాలి. దీంతో పాటు ఏపీఎంఐపీకి సంబంధించి బిందు, తుంపర్ల సేద్యం రిజిస్ట్రేషన్లు, రైతులతో పంట బీమా ఇలా అనేక పనులతో ఊపిరి తిప్పుకోలేని పరిస్థితి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇందుకు అదనంగా ఇతర శాఖల బాధ్యతలను అప్పగిస్తోంది. ఆర్‌ఎస్‌ఏ ఇన్‌చార్జ్‌ల విధులు, బాధ్యతలు వేరైనా అధికారుల ఆదేశాలతో చేయాల్సి వస్తోంది.

ఈ పనులు అదనం

వ్యవసాయ అనుబంధ శాఖతో పాటు సచివాలయంలోని మరికొందరు ఉద్యోగులకు వారి విధులతో పాటు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్, జియోట్యాగింగ్ బాధ్యతలు చేపడుతున్నారు. తాజాగా బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ చేయించే బాధ్యత కూడా వీరిపై రుద్దారు. ఉద్యోగులు, వ్యాపారులు, సంపన్నులు ఇలా ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాను ఎన్‌పీసీఐతో లింక్ చేయిస్తున్నారు. సచివాలయ సెక్రటరీలు చేయాల్సిన ఇంటికొలతల పనులు కూడా ఆర్‌ఎస్‌ఏ ఇన్‌చార్జీలతో చేయించడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నారు. ప్రతినెలా ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలి. నైపుణ్య గణన, ఎల్‌ఎస్‌ఈ సర్వే పనులు కూడా అప్పగిస్తున్నారు. ఇలా ఇతర శాఖల పనులు పెరిగిపోవడంతో వ్యవసాయ, అనుబంధ శాఖల పనులపై దృష్టి సారించలేని పరిస్థితి ఏర్పడింది.



జిల్లాలో 867 ఆర్‌ఎస్‌ఏలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 867 ఆర్‌బీకేలు (ఆర్‌ఎస్‌ఏ) ఉన్నాయి. ప్రతి ఆర్‌ఎస్‌ఏకు ఒక ఇన్‌చార్జ్ ఉండాలి. కాని జిల్లాలో 531 మంది మాత్రమే పని చేస్తున్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించి 531 మంది వీఏఏలు, ఉద్యాన శాఖకు సంబంధించి 215 మంది వీహెచ్‌ఏలు, సెరికల్చర్‌కు సంబంధించి 10 వీఎస్‌ఏలు పని చేస్తున్నారు. 336 ఆర్‌ఎస్‌ఏల ఇన్‌చార్జీల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీలు ఎక్కువగా ఉండటం వల్ల ఆర్‌ఎస్‌ఏ ఇన్‌చార్జీలపై పని భారం పెరుగుతోంది. పశుసంవర్ధకశాఖకు సంబంధించి గ్రామ స్థాయిలో ఏహెచ్‌ఏ పోస్టులు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 377 ఏహెచ్‌ఏ పోస్టులు ఉండగా... కర్నూలు జిల్లాలో 188 మంది, నంద్యాల జిల్లాలో 189 మంది ఉండగా... 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏహెచ్‌ఏలు అత్యవసర సర్వీస్‌లకు చెందిన వారైనప్పటికీ వీరితో కూడా ఇతర అన్ని శాఖల పనులు బలవంతంగా చేయిస్తున్నారు. ఇతర శాఖల పని ఒత్తిడి కారణంగా వారు మూగజీవాలకు వైద్య సేవలు అందించలేని పరిస్థితి ఏర్పడుతోంది.

ఒత్తిళ్లు భరించలేక...

రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జీలకు వ్యవసాయ అనుబంధ శాఖల విధులు, బాధ్యతలతో పాటు ఇతర శాఖల పనులు కూడా అప్పగిస్తుండటం ఏ రోజుకా రోజు ప్రోగ్రెస్ కోసం అన్ని శాఖల అధికారులు ఒత్తిడి తెస్తుండటంతో దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారు. రాత్రి 8 గంటలకు కూడా ఇంటికి చేరుకోలేని పరిస్థితి. దీనికితోడు రోజు 3 సార్లు బయోమెట్రిక్ హాజరు కూడా వేయాల్సి ఉంది. బయోమెట్రిక్ ఒక పూట వేయకపోయినా.. సగం రోజు విధులకు గైర్హాజరు అయినట్లే. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత అడ్డగోలు సర్వేలను వీరిపై బలవంతంగా రుద్దుతుండటం పట్ల తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఈనెల 25వ తేది విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా ఆళ్లగడ్డ మండలంలోని జి.జమ్ములదిన్నె ఆర్‌బీకేలో పనిచేసే హరినాథరెడ్డి కేంద్రంలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. పని ఒత్తిడి, అధికారుల వేధింపులతోనే అతను మృతి చెందినట్లు తోటి ఉద్యోగులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తమపై ఇతర శాఖల పనులు రుద్దవద్దని డిమాండ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంపై ఆందోళనకు సిద్ధమవుతున్నారు.



ఆత్మహత్యకు పాల్పడిన జమ్ములదిన్నె విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ హరినాథ్‌రెడ్డి (ఫైల్)

న్యూస్‌రీల్

శ్రీశైలం ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్‌గా వెంకటేశ్వర్లు

- సమగ్ర శిక్ష ఏపీసీగా టి.శ్రీనివాసులు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం పలువురు డిప్యూటీ కలెక్టర్లకు స్థానాలను కేటాయించింది. శ్రీశైలం ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్‌గా బీకే వెంకటేశ్వర్లును నియమించింది. ఇతను గతంలో కర్నూలు ఆర్‌డీఓగా పనిచేశారు. ప్రస్తుతం పోస్టింగ్ కోసం వేచి ఉన్నారు. అలాగే సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా టి.శ్రీనివాసులు నియమితులయ్యారు. ఇతను ప్రస్తుతం కావలిలో ఏపీఎంబీడీసీగా పనిచేస్తున్నారు. కర్నూలు ఆర్‌డీఓగా పనిచేసి పోస్టింగ్ కోసం వేచి ఉన్న ఎం.శేషిరెడ్డికి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–3 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. అలాగే కర్నూలు గవర్నమెంట జనరల్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్‌గా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సింధు సుబ్రమణ్యంను నియమించారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–4 ఎస్‌డీసీగా ఉండి సెలవులో ఉన్న కె.మల్లికార్జునుడికి పోస్టింగ్ ఇచ్చారు. అనంతపురం హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌డీసీగా నియమించారు.

రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయండి

- పీఆర్ ఎస్‌ఈ రామచంద్రారెడ్డి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీరు వీ రామచంద్రారెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ప్రాంగణం విశ్వేశ్వరయ్య భవన్‌లోని తన చాంబర్‌లో కర్నూలు, ఆదోని డివిజన్లకు చెందిన ఇంజినీర్లు, కాంట్రాక్టర్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీఎంజీఎస్‌వై, నాబార్డు, ఏపీఆర్‌ఆర్‌పీ, ఎన్‌ఆర్‌ఈజీఎస్, పల్లె పండుగ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ ప్రస్తుతం చేపట్టిన రోడ్ల సర్వేను డిసెంబర్ 6వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. అలాగే నియోజకవర్గాల వారీగా గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న విలేజ్ టు విలేజ్ కనెక్టివిటీ రోడ్ల ప్రతిపాదనలను రూపొందించి పంపాలన్నారు. సమావేశంలో కర్నూలు, ఆదోని ఈఈలు ఎన్‌సీఈ మద్దన్న, డీసీ వెంకటేష్, పీఐయు ఈఈ రఘురామిరెడ్డి, డీఈఈలు బండారు శ్రీనివాసులు, రమేష్ కుమార్‌రెడ్డి, భాస్కర్, శిల్పాశ్రీ, మురహరిరావు, మల్లికార్జున, అశ్వథామ పాల్గొన్నారు.

ఆర్‌యూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



ఎస్టీబీసీ కళాశాల పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ 5 సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 61 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ కర్నూలు నగరంలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల, ఎస్టీబీసీ డిగ్రీ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలను వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. ఎటువంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా పరీక్షలు నిర్వహించాలని కేంద్రాల చీఫ్ సూపరింటెండ్లకు ఆయన సూచించారు. మొదటి రోజు 6,531 మంది విద్యార్థులకు గాను 5,848 మంది పరీక్షలకు హాజరు కాగా 683 మంది గైర్హాజరైనట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

ఏఎంసీలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఏఎంసీ, ఆర్‌ఐసీయూలోని రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆసుపత్రిలోని వివిధ విభాగాలను తనిఖీ చేశారు. ఆర్‌ఐసీయూ, ఏఎంసీ విభాగంలో బెడ్‌సైడ్, వెంటిలేటర్లు, సెక్షన్ ఆపరేటర్లు అన్ని వసతులతో ఉండేటట్లు చూసుకోవాలని బయోమెడికల్ ఇంజనీర్‌ను ఆదేశించారు. బయోమెడికల్ ఇంజినీర్ ప్రతిరోజూ అన్ని విభాగాలను తనిఖీ చేసి బయోమెడికల్ పరికరాల వివరాలను ఇవ్వాలని చెప్పారు. డైట్ విభాగంలో డాక్టర్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం ఏ డాక్టర్స్ వస్తున్నారో వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, రోగులకు అందుతున్న భోజనం మెనూ ప్రదర్శించాలని డైట్ సిబ్బందిని ఆదేశించారు. ఓల్డ్‌గైనిక్ బ్లాక్‌లో డ్రైనేజీ మరమ్మతులను పూర్తి చేయాలని ఏపీఎంఎస్‌ఐడీసీ ఇంజినీర్లకు తెలిపారు. ఆయన వెంట సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ హేమనళిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాలనాగాంజన్, న్యూ డయాగ్నోస్టిక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ ప్రశాంత్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి ఉన్నారు.

కిషోరి వికాసం లక్ష్యం నెరవేర్చాలి

- జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య

కర్నూలు(అర్బన్): బాల్య వివాహాలు, లైంగిక దాడులు, వేధింపులపై గ్రామ, మండల స్థాయిలో కిషోర బాలికలకు అవగాహన కల్పించినప్పుడే కిషోరి వికాసం లక్ష్యం నెరవేరుతుందనే అభిప్రాయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బీ నవ్య వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో కిషోరి వికాసంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిశు సంక్షేమ సాధికారత అధికారిణి వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేసీ నవ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి జేసీ మాట్లాడుతూ ముఖ్యంగా ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు గ్రామ, మండల స్థాయిల్లో కూడా నిర్వహించి అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే గ్రామ, మండల స్థాయిల్లో ఉన్న కమిటీలను బలోపేతం చేసేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశాలను నిర్వహించాలన్నారు. అనంతరం బాల్య వివాహ విముక్తిపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన స్టేట్ రిసోర్స్ సభ్యులు పౌష్టికాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, రుతుస్రావం, బాల్య వివాహాలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, వేధింపులు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, సీడబ్ల్యూసి చైర్‌పర్సన్ జుబేదాబేగం, డీసీపీఓ టీ శారదతో పాటు ఎంపీడీఓలు, డీఆర్‌డీఏ, మెప్మా, మున్సిపల్ ఎడ్యుకేషన్ అండ్ హెల్త్ అధికారులు, ఎన్‌జీఓ ప్రతినిధులు, సీడీపీఓ, ఏపీఎంలు హాజరయ్యారు.



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ నవ్య

శ్రీగిరికి పోటెత్తిన భక్తులు

శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు శుక్రవారం భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తుల రద్దీతో శ్రీగిరి క్షేత్రం పోటెత్తింది. వేకువజామున పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి ఆలయ క్యూలైన్ల వద్దకు చేరుకున్నారు. కార్తీకమాసం మరో రెండు రోజుల్లో ముగుస్తుండడంతో పరమేశ్వరుడి దర్శనానికి భక్తులు బారులుదీరారు. గంగాధర మండపం వద్ద, ఆలయ ఉత్తర మాఢవీధిలో పలువురు భక్తులు కార్తీక దీపాలను వెలిగించి పూజలు నిర్వహించుకున్నారు. – శ్రీశైలంటెంపుల్



మల్లన్న దర్శనానికి బారులుదీరిన భక్తులు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవోపేతం.. స్వాతి మహోత్సవం

లక్ష్మీ నరసింహస్వామి జన్మనక్షత్రం అయిన స్వాతి పురస్కరించుకుని దిగువ అహోబిలం క్షేత్రంలో స్వాతి మహోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. నవనారసింహ క్షేత్రాల్లో కొలువైన మూలవిరాట్‌కు నిత్యపూజలతో పాటు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దిగువ అహోబిలంలో కొలువైన ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను నూతన పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో సుదర్శన, స్వాతి హోమాలను చేపట్టారు. – ఆళ్లగడ్డ

హమ్మయ్యా.. అధికారులు వచ్చారు!

- కోసిగి హాస్టల్‌ను సందర్శించిన జిల్లా యంత్రాంగం
- సమస్యల పరిష్కారానికి చొరవ
- పరిసరాలను శుభ్రం చేయించిన వైనం
- డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటుకు రూ. 25 లక్షలతో ప్రతిపాదనలు
- 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు

సాక్షి ఎఫెక్ట్

కోసిగి: సమస్యల మధ్య చదువుకుంటున్న విద్యార్థులకు కాసింత ఊరట కలిగింది. కోసిగి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను జిల్లా అధికారులు శుక్రవారం పరిశీలించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపారు. ఈనెల 17వ తేదీన సం'క్షేమం'లేదు..శీర్షికన సాక్షి మెయిన్ ఎడిషన్‌లో ప్రచురితమైన కథనానికి జిల్లా యంత్రాంగం స్పందించింది. మూడు రోజుల క్రితం మండల ప్రత్యేక అధికారి డీఈఓ శామ్యూల్ పాల్ హాస్టల్ తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశాల మేరకు శుక్రవారం పంచాయతీ అధికారి జి. భాస్కర్, సోషల్ వెల్ఫేర్ జేడీ రంగలక్ష్మీదేవి తదితరులు హాస్టల్ పరిసరాలు పరిశీలించారు. హాస్టల్ చుట్టూ ఉన్న ముళ్ల పొదలను అప్పటికప్పుడు జేసీబీ, ట్రాక్టర్‌తో తొలగించారు. మందుబాబులు తాగి పడేసిన సీసాలు, గ్లాసులు తొలగించి ఆవరణను శుభ్రం చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ హాస్టల్ ముందు నిలిచిన మురుగు నీటిని తాత్కాలికంగా తొలగించేందుకు పంచాయతీ నిధులు రూ.3 లక్షలతో ఇంకుడు గుంతలు తవ్విస్తామన్నారు. నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని వార్డెన్ కోటేశ్వరరావును ఆదేశించారు. డ్రైనేజీ నీటిని మురుగు కాల్వకు మళ్లించేందుకు పైప్‌లైన్ ఏర్పాటుకు రూ.25 లక్షలతో కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతామన్నారు. హాస్టల్ పరిసరాల్లోకి మందుబాబులు రాకుండా పోలీసు పెట్రోలింగ్ చేయించాలని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎస్‌ఐ చంద్రమోహన్‌ను ఆదేశించారు. వారి వెంట పంచాయతీ ఈఓ తిరుమలేశ్వర రెడ్డి, ఈఓపీఆర్డీ ఆరూన్ రషీద్ ఉన్నారు. సాక్షి కథనంతోనే తమ హాస్టల్ సమస్యలు పరిష్కారమవుతున్నాయని విద్యార్థులు కృజ్ఞతలు తెలిపారు.



హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న జేడీ రంగలక్ష్మీదేవి, డీపీఓ భాస్కర్



హాస్టల్ పరిసరాలను జేసీబీతో శుభ్రం చేయిస్తున్న దృశ్యం

ఎంఎస్‌ఎంఈ సర్వే పూర్తి చేయాలి

- సాగునీటి సంఘాల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించండి
- గ్రామసభల అర్జీలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయండి
- కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ఎంఎస్‌ఎంఈ సర్వేను నిర్మాణాత్మకంగా చేపట్టి ఫిబ్రవరి ఒకటో తేదీ నాటికీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని మండలాల్లో ఎంఎస్‌ఎంఈ సర్వే శుక్రవారం ప్రారంభమైందన్నారు. ఈ సర్వేను ఎంపీడీఓలు, మునిసిపల్ అధికారులు పర్యవేక్షణ చేసి రోజువారీగా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సాగునీటి సంఘాల ఎన్నికలు సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. రీసర్వేకు సంబంధించి గ్రామసభల ద్వారా వచ్చిన 18 వేల సమస్యలను పీజీఆర్‌ఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. డిసెంబర్ 31వ తేదీ నాటికీ ఆ సమస్యలను పరిష్కరించాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి పురోగతి చూపని 153 ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. వీరి వివరణలు సరిగా లేకపోతే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేపట్టాలని, చెత్త సంపద తయారీ కేంద్రాలను త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. పీజీఆర్‌ఎస్ సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎన్‌పీసీఐ లింకేజీ మ్యాపింలో కర్నూలు జిల్లా 24వ స్థానంలోఉందని,మెరుగైన స్థానాన్ని రాబట్టేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్‌ఓ వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

నేడు పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్‌టీఆర్ పెన్షన్ కానుక ఒక రోజు ముందే పంపిణీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. డిసెంబరు 1వ తేదీ ఆదివారం కావడంతో నవంబరు 30వ తేదీనే పింఛన్ల పంపిణీ చేయడానికి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. డిసెంబరు నెలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 4,56,936 పింఛన్లకు రూ.194.02 కోట్లు మంజూరయ్యాయి. కర్నూలు జిల్లాలో 2,40,330 పింఛన్లకు సంబంధించి రూ.102.55 కోట్లు, నంద్యాల జిల్లాలో 2,16,606 పింఛన్లకు సంబంధించి రూ.91.47 కోట్ల ప్రకారం విడుదల అయ్యాయి. నవంబరు నెలతో పోలిస్తే డిసెంబరు నెలకు 1,528 పింఛన్లపై కోత పడింది. నవంబరు నెలలో పింఛన్ తీసుకోని వారికి డిసెంబరుతో కలిపి ఇవ్వనున్నారు. ఇక నుంచి మూడు నెలల పింఛన్ ఒకేసారి పొందవచ్చనే వెసులుబాటుతో పంపిణీ శాతం తగ్గిపోనుంది. నవంబరు నెలతో పోలిస్తే డిసెంబరులో 1,528 పింఛన్లపై కోత పడింది.



క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన ఎం ఖాశీంబీ మృతదేహం

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన ఎం ఖాశీంబీ(41) తనకు పిల్లలు కలగలేదనే మనోవేదనతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాలు.. సుబ్రహ్మణ్యం, ఖాశీంబీ దంపతులకు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇంత వరకు పిల్లలు కలగకపోవడంతో పలు వైద్యశాలల్లో చూపించుకున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి కె.బాలుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫంక్షన్ హాల్‌లో నెక్లెస్ చోరీ

కర్నూలు: నగర శివారులోని నంద్యాల చెక్ పోస్టు సమీపంలో ఉన్న మెగా సిరి ఫంక్షన్ హాల్‌లో నెక్లెస్ చోరీకి గురయ్యింది. మెడికల్ రెప్ నారాయణ కోడలి శ్రీమంతం ఫంక్షన్ హాల్‌లో గురువారం రాత్రి జరిగింది. నారాయణ భార్య గొంతులో ఉన్న నెక్లెస్‌ను తీసి చిన్న బాక్సులో పెట్టి గదిలో పెడుతుండగా బంధువులు ఫొటో దిగేందుకు పిలవడంతో ఆమె వెళ్లి తిరిగి వచ్చేలోగా 4 తులాల బంగారు నెక్లెస్ మాయమైంది. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా అదే సమయంలోనే కెమెరా ఫుటేజీ వారికి కనిపించకపోవడంతో స్థానికులపైనే పోలీసులు అనుమానిస్తున్నారు.

గంజాయి కేసుల్లో నలుగురికి జైలు

కర్నూలు (లీగల్): గంజాయి కేసుల్లో నలుగురు నిందితులకు ఏడాది జైలు శిక్ష, రూ.18 వేల జరిమానా విధిస్తూ ఎక్సైజ్ మెజిస్ట్రేట్ ఎం.స రోజనమ్మ శుక్రవారం తీర్పు చెప్పారు. కర్నూలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు 2018లో ఈడిగ శ్రీనివాసులు గౌడు, హరిజన దావీదు, నీలిషికారి షన్ను, దోమల కార్తీక్ అనే వ్యక్తుల వద్ద గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కేసు విచారణలో వారిపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది.

జాతీయ స్థాయి పోటీలకు కంబాలపాడు విద్యార్థులు



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థులను పీఈటీ లక్ష్మయ్యతో కలిసి శుక్రవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ అండర్-19 జిమ్నాస్టిక్‌లో ఎస్.హేమంత్, అండర్-17 మాడ్రన్ పెంటలేనులో ఎస్.శ్రావణి, అండర్-14 డిస్కస్ త్రోలో బి.వెంకటేష్ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

అవుకు సొరంగ పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో శరవేగంగా జరుగుతున్న మూడో టన్నెల్ పనులు ఎన్నికల సమయంలో ఆగిపోయాయి. ఎలాంటి పెండింగ్ బిల్లులు లేకపోయినా పనులు పునః ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వానికి మనసొప్పడం లేదు.

– కోవెలకుంట్ల



అవుకు రిజర్వాయర్

అవుకు సొరంగ పనులపై నీలినీడలు

- ఎన్నికల ముందు ఆగిన మూడో సొరంగ నిర్మాణ పనులు
- పనుల పున:ప్రారంభంపై కూటమి సర్కార్ నిర్లక్ష్యం



ఆగిపోయిన మూడో సొరంగం నిర్మాణ పనులు

రాయలసీమ జిల్లాలను సస్యశ్యామలం చేయాలన్న ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అవుకు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు, గాలేరు నగరి, టన్నెల్ నిర్మాణ పనులు చేపట్టారు. మిగిలిపోయిన పనులపై ఆ తర్వాత వచ్చిన టీడీపీ సర్కార్ నిర్లక్ష్యం చేసింది. అనంతరం 2019లో అధికారం చేపట్టిన వైఎస్సార్ తనయుడు, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మిగిలిపోయిన పనులను పూర్తి చేయడంతోపాటు ముందు చూపుతో మరో ముందడుగు వేసి మూడో సొరంగ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఉన్న రెండు టన్నెళ్ల సమీపంలో 6-8 కి.మీ పొడవునా సొరంగ నిర్మాణానికి రూ.390 కోట్లు, పాణ్యం మండలం గోరుకల్లు నుంచి అవుకు రిజర్వాయర్ వరకు జీఎన్ఎస్ఎస్ లైనింగ్ పనులకు సొరంగం నిర్మాణానికి రూ.907 కోట్ల నిధులు కేటాయించారు. రెండు టన్నెళ్లతోపాటు మూడో టన్నెల్ అందుబాటులోకి వస్తే రాబోయే రోజుల్లో ఏటా వర్షాకాలంలో శ్రీశైలం జలాశయం నుంచి 15 రోజుల వ్యవధిలో వరద జలాలను గాలేరు నగరి ద్వారా 4.18 టీఎంసీల సామర్థ్యం ఉన్న అవుకు రిజర్వాయర్‌లోకి చేరుతాయి. అక్కడి నుంచి వైఎస్సార్ జిల్లా గండికోట రిజర్వాయర్ (26టీఎంసీలు), ఇదే జిల్లాలోని మైలవరం(6 టీఎంసీలు) రిజర్వాయర్లు నింపేలా వైఎస్సార్ ప్రభుత్వం అప్పట్లో చర్యలు తీసుకుంది. రెండు రిజర్వాయర్లు నింపిన తర్వాత వరద జలాలను పెన్నా నదికి విడుదల చేసి నెల్లూరు జిల్లా సోమశిల, కండలేరు రిజర్వాయర్లకు నీటిని తరలించాలన్నది లక్ష్యం.



గతంలో ప్రారంభించిన రెండు టన్నెళ్ల ద్వారా అవుకు రిజర్వాయర్‌లోకి నీరు చేరుతున్న దృశ్యం(ఫైల్)

ఎన్నికల ముందు ఆగిపోయిన పనులు

మూడు టన్నెల్ నిర్మాణం, జీఎన్ఎస్ఎస్ కాల్వ లైనింగ్ పనులకు రూ.1,297 కోట్ల నిధులు మంజూరు కాగా 2022 డిసెంబర్ నెలలో పనులు ప్రారంభమై ఏడాది పాటు శరవేగంగా కొనసాగాయి. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పనులు ఆగిపోయాయి. టన్నెల్ నిర్మాణంతోపాటు లైనింగ్ పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఈ ఏడాది జూన్ నెలలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇప్పటికి ఆరు నెలలు కావస్తున్నా పనులు పున:ప్రారంభించలేదు. కూటమి ప్రభుత్వం గతంలో పనులు కేటాయించిన కాంట్రాక్టర్ల ద్వారా మిగిలిన పనులు కొనసాగిస్తారా..? మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తారా అనే విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేదు. ఇప్పటికైనా మిగిలిపోయిన పనులను పూర్తి చేసి రాయలసీమ జిల్లాలకు తాగు, సాగునీటిని పుష్కలంగా సరఫరా చేయాలని ఆయా జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేసి.. ప్రజలకు అంకితం చేసి..

వైఎస్సార్ మరణం తర్వాత కిరణ్ సర్కార్, 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం జలయజ్ఞ పనులను నిర్లక్ష్యం చేయడంతో పది శాతం పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి. టీడీపీ హయాంలో ఫాల్ట్‌జోన్(మట్టిపొరలు)లో 160 మీటర్ల పనులు పూర్తి చేయలేక చేతులెత్తేసింది. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ అధికారంలోకి రాగానే రెండవ టన్నెల్‌లో నిలిచిపోయిన ఫాల్ట్‌జోన్ పనులను అత్యాధునిక పోలింగ్ సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తి పూర్తి చేయడమే గాక 134 మీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేసింది. గత ఏడాది అక్టోబర్ 30న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా టన్నెళ్లను ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. రెండు టన్నెల్ అందుబాటులోకి రావడంతో ఒక్కో టన్నెల్ నుంచి 10 వేల క్యూసెక్కుల వరద జలాలను అవుకు రిజర్వాయర్‌లోకి తరలించేందుకు మార్గం సుగమమైంది.

పనులు త్వరగా పూర్తి చేయాలి



మూడో టన్నెల్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి. 2022 డిసెంబర్ నెలలో పనులు ప్రారంభమయ్యాయి. గత డిసెంబర్ నెల నుంచి పనులు నిలిచిపోయాయి. వరద జలాలను జీఎన్ఎస్ఎస్ ద్వారా తరలించి రాయలసీమ జిల్లాలకు తాగు, సాగునీటిని సరఫరా చేయాలి.

– పురుషోత్తంనాయుడు, కునుకుంట్ల, అవుకు మండలం

తాగు, సాగునీటిని అందించాలి



శ్రీశైలం జలాశయం నుంచి అవుకు రిజర్వాయర్‌కు గాలేరునగరి సుజల స్రవంతి కాల్వకు అనుసంధానంగా ఉన్న సొరంగ మార్గాల ద్వారా నీటిని నింపాలి. వర్షాకాలంలో ఒక్కో సొరంగం నుంచి 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసేలా డిజైన్ చేశారు. గత ఏడాది అక్టోబర్ నాటికి రెండు సొరంగాలు పూర్తయ్యాయి. మూడో సొరంగ నిర్మాణాన్ని పూర్తి చేసి రాయలసీమ జిల్లాలకు తాగు, సాగు నీటిని అందించాలి.

– సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు

ఆదేశాలు రావాలి

గత ఏడాది డిసెంబర్ నుంచి మూడో సొరంగం, జీఎన్ఎస్ఎస్ లైనింగ్ పనులు ఆగిపోయాయి. ఇప్పటి వరకు 60 శాతం మేర పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే మిగిలిపోయిన పనుల పున:ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం. గతంలో ప్రారంభమైన రెండు టన్నెళ్ల ద్వారా అవుకు రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేసి అక్కడి నుంచి వైఎస్సార్ జిల్లా గండికోట, మైలవరానికి నీటిని సరఫరా చేశాం.

– సురేష్‌బాబు, ఎస్సార్‌బీసీ ఈఈ, అవుకు

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..

- సంకల్ప్-25 పేరిట ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- డిసెంబర్ 1 నుంచి అమలు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఇంటర్మీడియెట్ విద్యాశాఖ సంకల్ప్-25 పేరిట కొత్త కార్యక్రమం చేపడుతోంది. గత ఏడాది ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం తక్కువగా నమోదు కావడంతో ఈ చర్యలు తీసుకుంది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఫిబ్రవరి 5 వరకు దీనిని అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా చదువులో వెనుకబడిన విద్యార్థులకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్టడీ అవర్ నిర్వ హించనున్నారు. గత అక్టోబర్‌లో నిర్వహించిన త్రైమాసిక పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను మూడు గ్రూపులుగా విభజిస్తారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో ఐదారుగురికి ఒక అధ్యాపకుడిని కేటాయిస్తారు. వీరందరూ పాసయ్యేలా చూడాల్సిన బాధ్యత ఆ అధ్యాపకుడిపై ఉంటుంది. అన్ని కళాశాలలకు సమాధానాలతో రూపొందించిన క్వశ్చన్ బ్యాంకు ఇస్తారు. రోజువారీ అధ్యయనంలో భాగంగా విద్యార్థులందరూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్వశ్చన్ బ్యాంకు చదివి, ప్రశ్నలకు జవాబులు రాయాల్సి ఉంటుంది. అవసరమైతే 5 గంటలు దాటిన తరువాత కూడా స్టడీ అవర్ కొనసాగిస్తారు. గతంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు తరగతులు నిర్వహించేవారు. ఇప్పుడు 9 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు. విద్యార్థులందరూ అన్ని సబ్జెక్టుల్లోనూ ఉత్తీర్ణులయ్యేలా టైం టేబుల్ రూపొందిస్తారు. సంబంధిత జిల్లా అధికారులు వారానికి మూడు రోజులు కళాశాలలను సందర్శించి, సంకల్ప్ కార్యక్రమం అమలుపై సమగ్ర నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

పరీక్ష ఫీజు గడువు పెంపు

ఇంటర్ పరీక్ష ఫీజు గడువును అధికారులు పెంచారు. ఎటువంటి ఫైన్ లేకుండా వచ్చే నెల ఐదో తేదీలోగా విద్యార్థులు ఫీజు చెల్లించవచ్చు.

నిరంతర పర్యవేక్షణ



వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళిక అమలు చేస్తున్నాం. ఏ సబ్జెక్టులో విద్యార్థి వెనుకబడి ఉన్నాడో గుర్తించి, దానిపై పట్టు సాధించేలా బోధన ఉంటుంది. నిబంధనల మేరకు ప్రత్యేక తరగతుల నిర్వహణ బాధ్యతలను ఆయా కళాశాలల అధ్యాపకులు చేపట్టారు. విద్యార్థుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.

– సునీత, డీవీఈఓ, నంద్యాల

టీబీ బోర్డు కార్యాలయం ముట్టడి



కుటుంబ సభ్యులతో నిరసనకు దిగిన ఉద్యోగులు

కర్నూలు సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనాలోచితంగా చేసే పనులతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలలుగా వేతనాలు లేకపోవడంతో చిరుద్యోగుల బ్రతుకులు చిధ్రమవుతున్నాయి. దీంతో కడుపు మండిన ఉద్యోగులు టీబీ బోర్డు వర్క్‌చార్జ్ ఎంప్లాయిస్ అండ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం తుంగభద్ర బోర్డు సెక్రటరీ కార్యాలయాన్ని ముట్టడించారు. నవంబరు నెల వేతనాల బిల్లులు కూడా చేయలేదని, దీని వల్ల ఎల్ఎల్‌సీ కాలువ 0 కి.మీ నుంచి 250 కి.మీ వరకు లస్కర్లు, సూపర్‌వైజర్లు, కేర్ టేకర్స్ తదితర 165 మంది, రిటైర్డ్ ఉద్యోగులు 97 మందికి పింఛన్ అందకపోవడంతో అవస్థలు పడుతున్నారు. రాజకీయాల కోసం ఉద్యోగులను ఇబ్బంది పెట్టడంసరైంది కాదని, కర్ణాటక ట్రెజరీకి లేఖ రాసి కనీసం ఉద్యోగుల వేతనాలైనా చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వాన్ని పలువురు డిమాండ్ చేశారు.

యువకుడి దుర్మరణం

ఆత్మకూరు రూరల్: మండలంలోని కరివేన గ్రామం వద్ద శుక్రవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. కొత్తపల్లె మండలం గువ్వలకుంట్లకు చెందిన శంకర్ కుమారుడు శ్రీనివాసులు(31) ఆత్మకూరు ఉద్యానశాఖలో ఎంపీఈఓగా పని చేస్తున్నాడు. పని నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా మరో బైక్ ఇతడి ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతిచెందాడు. ఆత్మకూరు ఎస్ఐ నారాయణ రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం సీహెచ్‌సీకి తరలించారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- ప్రియుడితో భర్తను హత్య చేయించిన భార్య



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవికుమార్

కొలిమిగుండ్ల: ఈనెల 26న పెట్నికోటలో అనుమానాస్పదంగా మృతిచెందిన పామిడి రమేష్ కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి భార్యే హత్య చేయించింది. ఘటన వివరాలను శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ వెంకటేశ్వర్లుతో కలిసి ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ విలేకరులకు వెల్లడించారు. పెట్నికోటకు చెందిన పామిడి రమేష్, రమాదేవి దంపతులకు కొడుకు, కూతురు సంతానం. రమాదేవి కొంతకాలంగా అనంతపురం జిల్లా పుట్లూరుకు చెందిన వల్లెపు వేణుగోపాల్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈవిషయంలో దంపతుల మధ్య గొడవలు జరుగుతుండేవి. ఎలాగైనా భర్తను అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకుంది. ఈక్రమంలో ఈనెల 26న ఇంట్లో నిద్రిస్తున్న భర్త రమేష్‌ను ప్రియుడు వేణుగోపాల్‌తోపాటు అనంతపురం జిల్లా పెద్ద పప్పూరుకు చెందిన వడ్డె నారాయణస్వామితో కలిసి ముఖంపై తల దిండుపెట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం బైక్‌లో పారిపోయారు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈక్రమంలో నిందితులు వీఆర్వో పార్వతి ఎదుట లొంగిపోయారు. ఈమేరకు ముగ్గురిని అరెస్ట్ చేసి కోవెలకుంట్ల మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా రిమాండ్‌కు ఆదేశించినట్లు డీఎస్పీ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

- ప్రమాదం నుంచి బయట పడిన డ్రైవర్



కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లె ప్రధాన రహదారిలో శుక్రవారం తెల్లవారు జామున ట్రాక్టర్‌ను లారీ ఢీకొంది. ప్రమాదం నుంచి ట్రాక్టర్ డ్రైవర్ సురక్షితంగా బయట పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. బనగానపల్లె వైపు నుంచి తాడిపత్రికి వరి పొట్టు లోడుతో లారీ బయలుదేరింది. అంకిరెడ్డిపల్లె వద్దకు చేరుకోగానే మరో లారీ సాంకేతిక సమస్యతో ఆగిపోవడంతో ముందుగా ఆ లారీని ఢీకొని ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను బలంగా ఢీకొనడంతో ఇంజిన్ భాగం పూర్తిగా దెబ్బతింది. ప్రమాదాన్ని పసిగట్టిన ట్రాక్టర్ డ్రైవర్ కిందకు దూకడంతో క్షేమంగా బయట పడ్డాడు. ప్రధాన రహదారిపై ప్రమాదం చోటుచేసుకోవడంతో దాదాపు రెండు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

పొగాకు పంట ధ్వంసం



ధ్వంసమైన పొగాకు పంటను చూపుతున్న రైతులు

మిడుతూరు: రుద్రవరం మండలం రెడ్డి వారి పల్లె గ్రామానికి చెందిన సమీప బంధువులు తన పొగాకు పంటను ధ్వంసం చేశారని మిడుతూరు మండలం కడుమూరు గ్రామానికి చెందిన రైతు జయరాజు ఆవేదన వ్యక్తం చేశాడు. శుక్రవారం బాధిత రైతు మాట్లాడుతూ గుడిపాడు గ్రామ పొలిమేరలోని 2.25 ఎకరాలను సమీప బంధువు సంజమ్మతో 2010లో కొనుగోలు చేశానన్నారు. దాదాపు 14 ఏళ్ల నుంచి తానే సాగు చేసుకుంటూ ఉన్నానన్నారు. అయితే రిజిస్ట్రేషన్ చేయించేందుకు రాకపోవడంతో పాటు ఆమె కుమారులు పొలం తమదేనంటూ ఈనెల 28న దౌర్జన్యంగా రోటావేటర్‌తో పొగాకు పంటను ధ్వంసం చేశారని వాపోయాడు. పోలీసులు విచారించి తనకు న్యాయం చేయాలని రైతు కోరాడు.

విద్యార్థి బస్సుకు తప్పిన పెను ప్రమాదం

- ఫిట్స్ రావడంతో చాకచక్యంగా బస్సును ఆపేసిన డ్రైవర్



అంబులెన్స్‌లో డ్రైవర్ రామలింగను తరలిస్తున్న దృశ్యం

మంత్రాలయం: విద్యార్థి బస్సుకు పెను ప్రమాదం తప్పింది. ఫిట్స్ వచ్చినా డ్రైవర్ చాకచక్యంగా బ్రేకులు వేసి బస్సు ఆపడంతో ప్రమాదం నుంచి విద్యార్థులు బయటపడ్డారు. విద్యార్థులు తెలిపిన వివరాలు.. ఎమ్మిగనూరు డిపో నుంచి డ్రైవర్ రామలింగ ఉదయం బడిబస్సుతో మంత్రాలయం మండలం వగరూరు, వి.తిమ్మాపురం చేరుకున్నారు. ఆయా గ్రామాల్లో విద్యార్థులను ఎక్కించుకుని ఎమ్మిగనూరు-కోసిగి రోడ్డుపై వెళ్తున్నారు. జాలవాడి గ్రామం దాటిన తర్వాత డ్రైవర్‌కు ఫిట్స్ వచ్చాయి. దీంతో బస్సులోని విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. బస్సును డ్రైవర్ చాకచక్యంగా నిలిపివేడయంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే తేరుకున్న విద్యార్థులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో డ్రైవర్‌ను ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడి మృతి

- ముగ్గురికి గాయాలు



మల్లికార్జున మృతదేహం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సమీపంలోని బ్రహ్మగుండం రహదారిలో నక్కల మిట్ట(ఎగు మిట్ట) వద్ద ట్రాక్టర్ టైరు పగిలి బోల్తా పడటంతో ఓర్వకల్లుకు చెందిన మల్లికార్జున(26) దుర్మరణం చెందాడు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. ఓర్వకల్లుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రామాంజనేయులు, నాగేశ్వరరావు, కృష్ణ, మల్లికార్జున నాపరాళ్ల లోడుతో కృష్ణగిరి మండలం ఎస్‌హెచ్ ఎర్రగుడికి బయలుదేరారు. వెల్దుర్తి సమీపానికి చేరుకోగానే మిట్ట ఎక్కే క్రమంలో టైర్ పేలిపోవడంతో ట్రాలీ బోల్తా పడింది. ఈక్రమంలో డ్రైవర్ రామాంజనేయులుతోపాటు ట్రాలీ మీద ఉన్న నాగేశ్వరరావు, కృష్ణ, మల్లికార్జున కిందకు దూకారు. నాపరాళ్లు మల్లికార్జునపై పడటంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ముగ్గురికి గాయాలు కావడంతో అంబులెన్స్‌లో వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించారు. వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సైబర్ నేరాల పట్ల స్వీయ జాగ్రత్తలు అవసరం



మంత్రాలయం మాధవరం సర్కిల్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

- జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి

కర్నూలు: ఆన్‌లైన్ లావాదేవీల కోసం టెక్నాలజీని వాడుతున్నప్పుడు స్వీయ జాగ్రత్తలు పాటించడం చాలా ముఖ్యమని, సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలంటే ఎవరికి వారు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ బిందు మాధవ్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది సైబర్ నేరాల నియంత్రణకు, కట్టడికి అవగాహన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తూ ముద్రించిన కరపత్రాలను డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీలు, రద్దీ ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో విస్తృతంగా పంపిణీ చేశారు. శుక్రవారం ఒక్క రోజే 8 వేలకు పైగా కరపత్రాలను పంపిణీ చేసి సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ప్రక్రియ ఇకపై నిరంతరం కొనసాగుతుందని ఎస్పీ స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించడమే కాక వాటిని ఎలా అరికట్టవచ్చో కూడా ప్రజలకు పోలీసులు వివరిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులను ఓపెన్ చేయకూడదని హెచ్చరిస్తున్నారు. జిల్లాలో సైబర్ నేరాలు పెరుగుతున్న క్రమంలో ప్రతి ఒక్కరికీ వాటి పట్ల అవగాహన అవసరమని పోలీసులు వివరిస్తున్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలంటే స్వీయ అప్రమత్తత ముఖ్యమని ఎస్పీ బిందు మాధవ్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఇస్తెమాకు ఏర్పాట్లు చేయండి

- మంత్రి ఎన్ఎండీ ఫరూక్



మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

ఆత్మకూరు: వచ్చే యేడాది జనవరిలో ముస్లింలు నిర్వహించుకునే ఇస్తెమాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదేశించారు. ఇస్తెమా నిర్వహణ స్థలాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అదిరాజ్‌సింగ్, స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఇస్తేమాకు దాదాపు 2 లక్షల మంది ముస్లింలు హాజరయ్యే అవకాశం ఉండటంతో ఆ దిశగా ఏర్పాట్లు చేసేందుకు అన్ని శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా మాట్లాడుతూ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఇస్తెమా కమిటీ సభ్యులు అబిబుల్లా, అమీర్, నూర్‌బేగ్, గౌస్‌లాజం, గౌస్ అజామ్, కలిముల్లా, మౌలానా, రహంతుల్లా, శాలుపైల్‌మాన్, ఇషాక్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, కో ఆప్షన్ సభ్యులు రషీద్ పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీల్లో ఆర్‌యూకు మూడో స్థానం



మహిళల జట్టును అభినందించిన దృశ్యం

కర్నూలు (టౌన్): ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రం బెలగావిలోని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీలో నిర్వహించిన సౌత్‌జోన్ అంతర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ మహిళల టోర్నమెంటులో రాయలసీమ యూనివర్సిటీ జట్టు మూడో స్థానంలో నిలిచింది. అలాగే రాజస్తాన్‌లోని జగదీశ్ ప్రసాద్ జబర్మల్ తిబ్రేవాలా విశ్వ విద్యాలయంలో వచ్చే నెల 3 నుంచి 6 వ తేదీ వరకు నిర్వహించనున్న ఆల్ ఇండియా స్థాయి అంతర్ యూనివర్సిటీ పోటీలకు అర్హత సాధించింది. దీంతో ఆర్‌యూ జట్టును వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ శుక్రవారం అభినందించారు. అనంతరం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ విజయ్‌కుమార్ నాయుడు, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కేవీ కిషోర్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ Regular/ Distance/ Discontinued/ Failures/ Detained Students. 10th, 12th, Diploma, B.Tech, M.Tech, BA, B.Com, BSC, MA, M.Com, MSC, BSW, BLIC, BBA, BCA, BEd, MPEd, LLB, MPHW, MBA, MCA, Ag.BSC, PHD. Cell: 86861 72989 [L-794853]

REAL ESTATE

PLOT FOR SALE

■ ప్యూచర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ వారి న్యూ వెంచర్ అక్షయ డ్రీమ్ వ్యాలీ హుస్సేనాపురం ఊరు ఆనుకొని వివిధ వెంచర్ల మధ్యన తక్షణం ఇల్లు కట్టుకొనే అవకాశం కలదు. తక్కువ ధరకు ప్లాట్లు అమ్మబడును. సంప్ర: 6300265849. [L-783285]

WANTED

■ కర్నూలు మరియు నంద్యాల జిల్లాల్లో పని చేయుటకు యువతి,యువకులు కావలెను. జీతం: 8-15 వేలు. అర్హత: ఇంటర్,డిగ్రీ. అనుభవం గల వారికి మంచి జీతం. సెల్: 98493 71537 [L-794860]

■ కర్నూలు విజయడైరీ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం 11 వేలు. అర్హత: 10th P/F. డ్యూటీ 8 గంటలు. సంప్ర: 95817 76924, 25 [L-1259402]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పని చేయుటకు లేడీ టెలికాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం+కమీషన్ ఇవ్వబడును. సంప్ర: కర్నూలు. ✆ 63002 65849 [L-783289]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ నందు వర్క్ చేయుటకు టెలికాలర్స్(Female) మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (నోటార్గెట్), అకౌంటెంట్. అందరికి పర్మినెంట్ జీతం ఇవ్వబడును. సెల్: 6305597809, 6281183283. [L-1259404]

■ Wanted Qualified & Experienced Staff: ప్రముఖ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో పనిచేయుటకు OT (ఆపరేషన్ థియేటర్) టెక్నీషియన్(M/F), Anasthesia టెక్నీషియన్(F), లేడీ రిసెప్షనిస్ట్, Marketing Female/MBA (Marketing) & సెక్యూరిటీ గార్డ్ కావలెను. పై తెలుపబడిన ఉద్యోగములకు 2సం॥ల అనుభవం కలిగిన వారు మాత్రమే ఉండవలెను. తమ CVలతో ఈ అడ్రస్సుకు సంప్ర: సుశ్రుత స్పెషాలిటీ హాస్పిటల్స్ & IVF సెంటర్, గౌరీగోపాల్ హాస్పిటల్స్ దగ్గర బుధవారపేట, కర్నూలు. సెల్: 9014709424. [L-783296]

■ Wanted Experienced & Qualified High School Teachers For All Subjects. one Pet, one Computer Faculty. (Salary Range 15,000 to 25,000) & Also To Teach Nursery to V Teachers. Attend Interview on 1/11/24 & 2/11/24 Between 10am to 1pm. Cont: KVR High School, KVR Gardens, Opp: Vaddegeri, KNL. Cell: 8639708339, 7702362798. [L-549]

■ Wanted Video Editor (Male/Female) Sal:15K to 20K with food & Accom. St.Antony's high school. Porumamilla, Kadapa (Dt). Con: 8822269999 [C-1249235]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-25k ఉచిత రూము, భోజనము సదుపాయం, వర్క్‌ఫ్రంహోం అవకాశముంది. సం:91102 56233 [G-9078]

■ AP & TG ప్రముఖ TV చానల్లో మీ జిల్లాలో పనిచేయుటకు డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జ్, నియోజకవర్గ ఇన్‌చార్జెస్, మండల రిపోర్టర్స్ కావలెను. సంప్ర॥ 94939 47007 [V- 823957]

■ తిరుపతి, గాజులమండ్యంలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, లేబర్ కావలెను. భోజనము, వసతి కలదు. సంప్ర: 9100518607, 9515488473. [T-2411]

■ సెక్యూరిటీ గార్డ్స్, హౌస్ కీపింగ్ కావలెను. కడప, నెల్లూరులలో 12గం డ్యూటీ, 50సం॥లోపు మగవారు రూము వసతి కలదు. వివరములకు సంప్రదించండి: 7288004466, 9573574277. [NA-6715]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ : 18K. Ph: 9160900024, 9640400073 [HA-1385]

■ కష్టలెస్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం.HYD. 7995365999 [HA-99148]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

